

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి : 10 ఏప్రిల్, 2014 సంచిక : 11

(జయ నామ సం॥, వైశాఖ మాసం)

**గౌరవ సంపాదకత్వం**
**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ**

**ప్రధాన సంపాదకత్వం**
**శ్రీ మాతా శుకవాణి**
భాషా ప్రవీణ, M.O.L.,M.A

**ప్రత్యేక సహకారం**
**శ్రీ వి.వి. కృష్ణారావుగారు (సాయిశ్రీ ప్రింటర్స్)**

**ప్రచార సారథ్యం**
**శ్రీ ఎం. సత్యనారాయణగారు** M.Tech

**సాయివాణి చందా వివరాలు**

| | | |
|---|---|---|
| విడి ప్రతి .......... | రూ॥ | 8/- |
| వార్షిక చందా .......... | రూ॥ | 80/- |
| ఆజీవన సభ్యత్వం .......... | రూ॥ | 800/- |

**చిరునామా :-**

**సాయివాణి**

C/o **శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు**
సాయిధామం, రామలింగంపల్లి(పోస్టు),
బొమ్మల రామవరం మండలం,
నల్గొండ జిల్లా - 508 126. ఆం.ప్ర.
**Ph : 9440413455, 9848133565**
Website : www.saidhamam.org

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి .......... 2
సత్కార్యానికి స్వాగతం .......... 4
శ్రీ గజానన విజయం .......... 5
శుకవాణి .......... 7
నమస్కారం .......... 9
షిరిడీ డైరీ .......... 13
శ్రీ సాయి-సేవ .......... 15
మాతృసంస్థ కబుర్లు .......... 18
విద్యావేత్త జిడ్డు కృష్ణమూర్తి .......... 25
స్వరాంజలి .......... 27
మంగళాక్షతలు .......... 28
ఏమి వస్తుంది? .......... 30
పఠనంతో జన్మ ధన్యం .......... 31

E-mail : saidhamam.seva@gmail.com, saidhamam.ram@gmail.com







## మా వాణి



మార్చి తొలివారంలోనే ఆంధ్రదేశమంతా వేడెక్కిపోయింది-ఎండ వేడిమికి కాదు, ఎలెక్షన్ల వేడిమికి. నోటిఫికేషన్ యింకా విడుదల కాక ముందే సూట్‌కేసుల తరలింపు ప్రారంభమైంది. కోట్లాది రూపాయలు విలువ చేసే నోట్లకట్టలు పోలీసులకే దొరికాయంటే-దానికి ఎన్ని వందల రెట్లు రవాణా అయ్యాయో మనం ఊహించవచ్చు. తమకు ఎన్నికల్లో నిలబడే అవకాశం యివ్వలేదు కాబట్టి పార్టీ మారామని నిర్లజ్జగా, పబ్లిక్‌గా చెప్పుకొంటున్నవారు కొందరు, సీటు కోసం కిరోసిన్ పోసుకు చస్తామనేవారు ఇంకొందరు, ఏ పాలసీ లేకుండానే పార్టీలు పెట్టి బరిలోకి దిగేవారు మరికొందరు.

ఇళ్లు కట్టిస్తాం, వస్తు వాహనాలు కొనిస్తాం, పట్టుచీరలు, టీవీలు సమర్పించుకుంటాం అని అనేవారే అందరూ. అంతేకాదు సర్వ వర్ణాల వారికి రిజర్వేషన్లు ఇచ్చేస్తాం, భూకబ్జాదారులను, ఉరిశిక్ష పడినవారిని కూడా వదిలేస్తాం, మీ స్విస్‌బ్యాంక్ ఎకౌంట్ల జోలికి రాముగాక రాము-అనేవారు కూడా ఉండవచ్చు. అలా ఏ వాగ్దానాలూ చేయకుండా-"అవినీతిని అరికడతాం, సరిహద్దుల్ని రక్షిస్తాం" అనే మహానుభావుడు ఎవరైనా ఉంటే వాడిని ఎలా బుట్టలో పెట్టాలో పెద్దదొరతనం వారికి తెలియకపోలేదు, ఇలాంటి పరిస్థితుల్లో ఎవరికి ఓటు వేయాలో తెలియక సామాన్య ఓటర్లే కాదు-మహామాన్యులైన ఓటర్లు కూడా తలక్రిందులైపోయే పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో -

ఇది హిందూ దేశం, హైందవ ధర్మాన్ని నిలుపుకోవడం మన కర్తవ్యం. దొరతనం వారి సహాయ సహకారాలు మొత్తం అన్య మతాల వారికీ,

హిందువులమని చెప్పకొంటూ ప్రభుత్వం ఇచ్చే రిజర్వేషన్లను స్వీకరిస్తూనే-చర్చిలలో ప్రార్థనలు, హిందూ వ్యతిరేక ప్రచారాలు చేస్తుండే వారికి మాత్రమే లభిస్తుండగా-హిందూ ధర్మం నిలిచేదెక్కడ? అసలు హిందువులుగా ఉండాలనుకునేది ఎవడు? ఈ దేశం మీద ఉగ్రవాదపు పంజా విసిరిన వాడికి కఠినమైన శిక్ష విధించాలంటే మనవాళ్లే బావురుమంటారు. ఏ నక్సలైట్‌నో, ఉగ్రవాదినో పోలీసులు చంపారంటే ప్రజా హక్కుల పరిరక్షకుల గుండెలు గుబగుబలాడిపోతాయి. వాడి చేతిలో కూలిపోయిన కొంపల లెక్కలు మాత్రం ఎవ్వరూ పట్టించుకోరు. ఇలా ఎందుకు జరుగుతోంది? సింహాసనం మీద ఉన్న వారికి తమ శ్రేయస్సు తప్ప మరేమీ పట్టదు గనుక.

ఏ దేశాన్నైనా పరిపాలించేవారు ఆ గడ్డ మీది ధర్మాన్నీ, సంస్కృతినీ అవగాహన చేసుకున్నవాడై ఉండాలి. ఆ మట్టివాసనకు వాడి గుండె పరవశించాలి. ఆ జాతి ఘనచరిత్రకు వాడి తనువు పులకరించాలి. తన జాతి అభ్యున్నతి కోసం ప్రాణాలర్పించిన వారిని తలచుకుంటే వాడి ఎద పొంగాలి. ఆ గడ్డ మూలలను అతడు ప్రేమించగలగాలి. ఆ నీటిలో, ఆ గాలిలో అతని ప్రాణస్పందన లయించగలగాలి. ఆ విధంగా పరిపూర్ణమైన ప్రేమ, అవగాహన, జాతికోసం దేనినైనా విడిచిపెట్టగల స్వార్థరహితపు తెగువ ఎవరికి ఉంటాయో వాడే పరిపాలనకు అర్హుడు. అటువంటివాడు ఎక్కడ? ప్రస్తుతం మన దేశ పాలకులకు ఈ లక్షణాలు ఉన్నాయా? లేవని మనందరికి తెలుసు. హిందువులకు ఈ గడ్డ తప్ప నిలవనీడ లేదు. ఈ ధర్మం తప్ప మరొక రక్ష లేదు. అందుచేత పదేపదే ఆలోచించండి, అన్నలారా, అక్కలారా! "హైందవ ధర్మ దీప్తి కోసం, భారతజాతి సనాతన గౌరవం నిలపడం కోసం కృషి చేస్తాం, దేశాభ్యున్నతికి అడ్డు వచ్చే దేనినీ మేము సహించం" అని స్పష్టంగా, ప్రమాణపూర్వకంగా చెప్పగలిగినవారు మీనియోజక వర్గంలో ఎవరుంటే వారికే ఓటు వేయండి. దేశాన్ని, ధర్మాన్ని రక్షించండి. మీ భవిష్యత్ జాతిని కాపాడుకోండి.





# సత్కార్యానికి స్వాగతం

## శ్రీ కోదండ రామ సాయి సన్నిధానం ఆశ్రమం

### ఆనంద సాయిప్రభు మందిరం, సత్తెనపల్లి

ప్రియ సాయి మిత్రులారా,

సత్తెనపల్లి రైల్వేస్టేషన్‌కు దగ్గరలోని శ్రీ కోదండ రామ సాయి సన్నిధానం ఆశ్రయంలో ఎనిమిది పదుల వయసున్న కోదండ రామాలయం ఉన్నదని మీ అందరికీ తెలుసు. (దీనిని ఒకప్పుడు కబ్బయ్యగారి గుడి అనేవారు.) శిథిలదశలో ఉన్న ఆ ఆలయానికి చిన్న చిన్న రిపేర్లు చేసి, గుడి ముందరి అరుగును విశాలంగా చేసి, గుడి చుట్టూ ఫెన్సింగ్ వేసాము. నిత్య పూజ, వారం వారం సత్సంగాలు నడుస్తున్నాయి.

ప్రస్తుతం యీ ఆశ్రమ అధినేతలు పరమపూజ్యులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ వారు రామాలయం ప్రక్కనే శ్రీ సాయిబాబా వారికి దేవాలయ నిర్మాణం తలపెట్టి కొనసాగిస్తున్నారు. గోపుర నిర్మాణం జరుగుతున్నది. సుమారు పాతిక లక్షలకు పైగా ఖర్చవుతుంది యీ దేవాలయానికి. (ఫ్లోరింగ్, తలుపులు, ద్వారబంధాలు, కిటికీలు, వైరింగ్, రంగులద్దటం, విగ్రహ ప్రతిష్ఠ వంటి పనులెన్నో ఉంటాయింకా)అందునిమిత్తం సహృదయులైన దాతలను ముందుకువచ్చి యీ మహత్కార్యంలో పాలుపంచుకొని, శ్రీ సాయినాథుల కరుణాకటాక్షాలు పొందవలసిందిగా ఆహ్వానిస్తున్నాం. క్రిందిరీతిలో దాతలపేర్లు ఆలయప్రాంగణంలో వ్రాయబడతాయి.

రు.1,00,000/- సహకారం అందించినవారు **'మణి పుష్పదాత'**

రు. 50,000/- సహకారం అందించినవారు **'స్వర్ణ పుష్పదాత'**

రు. 25,000/- సహకారం అందించినవారు **'రజత పుష్పదాత'**

రు. 11,116/- సహకారం అందించినవారు **'తామ్ర పుష్పదాత'**

రు. 5,116/- సహకారం అందించినవారు **'తులసీదళ దాత'**

గానూ నిలిచిపోతారు. దైవమిచ్చిన దానిలో కొంత దైవకార్యానికై వినియోగించండి, ధన్యులు కండి - తరలిరండి.

**సంప్రదించవలసిన ఫోన్లు :**

**9440413455**
**9848133565** | హైదరాబాదు
**9618065971** - సత్తెనపల్లి

**ప్రధాన కార్యదర్శి,**
**శ్రీ సాయీ సేవా సమితి ట్రస్ట్**

# శ్రీ గజానన విజయం



- ప.పూ.శ్రీశ్రీశ్రీ సత్యపదానంద ప్రభుజీవారు

**(గత సంచిక తరువాయి)**

మంచిగంధపు చెట్ల మధ్య పెరిగిన తుమ్మచెట్టుకు సువాసన అబ్బినట్లు, కస్తూరి కలిసిన మట్టికి సుగంధం అబ్బినట్లు ఆయన దగ్గర చేరిన వ్యక్తులు గూడా ప్రజలు యిస్తున్న మర్యాదలను పొందుతున్నారు. కాని దానితో తృప్తిపడక అహంకారాన్ని, దర్పాన్ని ప్రదర్శించటం ప్రారంభించారు. అలాంటి నీచుల్లో విఠోబా ఘాటోల్ ఒకడు. శంకరుని దగ్గర ఉండే నందిగా తనను తాను భావించుకున్నాడు. స్వామిని చూడటానికి వచ్చే భక్తుల నుండి తినుబండారాలు, మిఠాయిలు, దక్షిణలు స్వామి పేరిట సేకరిస్తూ ఉండేవాడు. అహంకారంతో ఇతర భక్తుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తుండేవాడు.

ఒకరోజు దూరప్రాంతం నుండి కొందరు భక్తులు స్వామి దర్శనానికి వచ్చారు. ఆ సమయంలో స్వామి నిద్రలో ఉన్నారు. అటువంటప్పుడు ఆయన్ను లేపటానికి ఎవ్వరూ సాహసించరు. ఆ సందర్శకులు తొందరలో ఉండటం వల్ల దర్శనం యిప్పించమని ఘాటోల్‌ను పొగడుతూ ప్రాధేయ పడ్డారు. దాంతో ఘాటోల్ ఉబ్బితబ్బిబ్బై పద్ధతికి విరుద్ధంగా స్వామిని మేల్కొల్పాడు. సందర్శకులు దర్శనం చేసుకున్నారు.

కాని మహారాజు ఒక పెద్దకర్ర తీసుకొని ఘాటోల్‌ను బాదారు. తమ పేరు చెప్పి తన అవసరాలు తీర్చుకోవటం గురించి తీవ్రంగా మందలించారు. అంతే ఘాటోల్ అక్కడినుండి ఒకటే పరుగు. మళ్ళీ కనిపిస్తే ఒట్టు.

నిజమైన సాధుపురుషులందరూ ఇలాంటి కపటుల్ని యిలాగే తరిమి వేస్తూ ఉంటారు-స్వయంగా తాము కూడా కపటులైతే తప్ప. ఇలాంటి కపటుల శిష్యులమని చెప్పకొనేవారు తమ స్వలాభం కోసం తమ





గురువులనబడే మోసగాళ్ళు తమను తాము కీర్తించుకుంటూ వ్రాసిన పుస్తకాలను ప్రచారం చెయ్యటం, వారిలో నిజాయితీ, దైవచింతన ఏమీ లేకపోయినా వారిని ఆకాశానికి ఎత్తి ప్రచారం చెయ్యటం వంటివి చేసి లబ్ధి పొందాలని చూస్తుంటారు. ఇది అన్నికాలాలలోనూ జరుగుతూ ఉంటుంది. ప్రజలు మోసపోతూనే ఉంటారు. నిరంతరం దైవచింతనలో ఉండే మహనీయులు మాత్రం అత్యంత నిరాడంబరంగా ఉంటూ కపటుల్నీ, స్వార్థపరుల్నీ దగ్గరకు చేరనీయరు.

అయితే అటువంటి స్వార్థపరులూ, కపటులూ పశ్చాత్తాపం పొందితే మాత్రం స్వామి ఆదరణకు పాత్రులౌతారు. మహాత్ములు అలాంటి వారికి వేసే శిక్షలు కూడా ప్రేమతో వారిని మార్చటానికే. ఈ తల్లి నేల పూల మొక్కను, ముళ్ళకంపనూ కూడా సమానంగానే పోషిస్తుంది.

విఠోబా ఘాటోల్ యీ విధంగా అహంకారపూరితుడై ప్రవర్తించక పోయినట్లయితే అందరిచేతా గొప్ప భక్తుడుగా గౌరవింపబడేవాడు కదా!

అతడు మహారాజుల వారి గొప్పదనాన్ని గుర్తించలేదు. ఆయన ఒక కల్పవృక్షం. అలాంటి మహనీయుని దగ్గర ఉంటూ ఆధ్యాత్మికమైన మేలును కోరక ఒక గులకరాయి కోసం పాటుపడ్డట్లైంది.

**(సశేషం)**

**పరమపూజ్య గురుదేవులు**


**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు**

**సాయివాణి పాఠకులందరికీ**

**శ్రీరామనవమి**

**శుభాశీస్సులు అందిస్తున్నారు-దోసిలొగ్గండి**

# శుకవాణి



శుకమహర్షి వాక్కు శుకవాణి. భాగవతం శుకమహర్షి ప్రోక్తం. కనుక దానికి శుకవాణి అన్న పేరున్నది. సంస్కృత శ్లోకాలలో ఉన్న మూల భాగవతాన్ని సుమనోహరమైన రసమయశైలితో పద్యాలలో అనువదించారు పోతనామాత్యులు. పద్యం అన్నది తెలుగుకు తప్ప మరే భాషకూ దక్కని సొగసు, సోయగం, సౌభాగ్యమున్నూ. భావ రాగాలు మేళవించి పాడుకోవటానికి వీలుగా యతి, ప్రాసలతో తనదైన విశిష్టతను సంతరించుకొన్న ప్రక్రియా విశేషం పద్యం. అది సహజకవి పోతన్నగారి చేతిలోపడి అత్యద్భుతమైన శబ్దాలంకారాలతోనూ, లలిత మధురమైన రసభావాల తోనూ కమ్మని రుచిని సంతరించుకొన్నది. అలవోకగా ఎన్నెన్నో ఆధ్యాత్మిక విశేషాలను కూడా మనకు అందిస్తాయి పోతన్నగారి పద్యాలు.

వామన చరిత్ర ఒక రసమయ ఘట్టం భాగవతంలో. శ్రీ మహావిష్ణువు అదితి గర్భాన జన్మించి, వామనుడై బలిచక్రవర్తి చెంతకు వెళ్లాడు. పరమ గురుభక్తిపరుడైన బలిని ఆ గురుభక్తికి దూరం చేసి, ఆ శక్తి నశించిన బలిని పాతాళానికి తొక్కేసి, ఆయన దగ్గరున్న దేవతా సంపత్తిని తిరిగి దేవతలకు అందించటం ఆయన లక్ష్యం. అందుకై యాచనకు వెళ్లాడు బలి చెంతకు. అడగబోయినవాడు ఎంతటి మహనీయుడైనా సరే దాత ముందు కుంచించుకుపోవలసిందే గదా! అందుకే వామనుడైనాడు ఆది పురుషుడు. బుడి బుడి (నడకల) నుడువులు నుడువుచు, వెడవెడ నడకలు నడచుచు, ఆ చిటిపొటి వడుగు తన చెంతకురాగా- "వడుగా ఎవ్వరివాడవు, ఎవ్వడవు, సంవాసస్థలం బెయ్యది?" అంటూ వివరాలు అడిగాడు చక్రవర్తి. దానికి జవాబుగా అత్యద్భుతమైన మార్మికమైన పద్యం చెప్పాడు మన బుడుగు. దాని రామణీయకత చూడండి -

"ఇది నాకు నెలవని యేరీతిఁ బలుకుదు నొకచోటనక నిండి






యుండనేర్తు,
నెవ్వనివాఁడ నం చేమని పలుకుదు నాయంత వాఁడ నై నడవనేర్తు,
నీ నడవడి యని యెట్లు వక్కాణింతుఁ బూని ముప్పోకలఁ బోవనేర్తు,
నదినేర్తు నిదినేర్తు నని యేల చెప్పంగ నేరుపు లన్నియు నేన నేర్తు,
నొరులు గారు నాకు నొరులకు నే నొదు
నొంటివాఁడఁ జుట్ట మొకఁడు లేఁడు
సిరియుఁ దొల్లిఁ గలదు సెప్పెద నా టెంకి
సుజనులందుఁ దఱచుఁ జొచ్చియుందు.

అవును మరి- పరమాత్మునికి ఫలానాది స్వస్థలమని ఉండదు గదా! ఇక్కడ - అక్కడ అన్న భేదం లేక సర్వే సర్వత్ర నిండి ఉంటాడు స్వామి. (అలరు విశ్వాత్మకునకు ఆవాహనమిదె-అంటూ ఓ చిన్న వ్యంగ్యాత్మక పంక్తి పాడారు అన్నమయ్య తన "షోడశ కళానిధికి షోడశోపచారములు" అన్న పాటలో.) ఇందు గలడందు లేడను సందేహము వలదన్నారు. స్వయంగా పోతన్నగారే మరోచోట. ఇక ఎవరి తాలూకయ్యా దైవం-అంటే "నా అంతట నేనే ప్రభవించి నడుస్తా"నన్నాడు వామనయ్య. స్వయంభువునని చెప్పాడన్న మాట. ఈ తీరు, ఆ తీరు అని ఏమున్నది! ముల్లోకాలలోనూ తిరుగుతాను- సత్త్వరజస్తమో గుణాలు మూడు తీరులా ప్రవర్తిస్తానన్నాడు. "నాకు అది వచ్చు, ఇది వచ్చు" అని ఎలా చెప్పడం? అన్నిరకాల నైపుణ్యాలూ నా దగ్గరే ఉన్నాయి" అన్నాడు. అన్నిటికన్నా ముచ్చటైన మాట. "ఇతరులెవ్వరూ నాకు బంధువులు కారు. అందరికీ నేనే బంధువును" అన్నది. మనకు ఎవ్వరెవ్వరో బంధుబలగం ఉన్నారన్న భ్రమలో ఉంటాం. ఇక్కడ పరమాత్ముడు చెప్తున్నాడు- నేనే అందరికీ బంధువును, ఆప్తుడను - అని.

'సిరియు తొల్లి గలదు' - లక్ష్మి ఉండేది పూర్వం. మరి యీ వడుగుతో దేవేరి ఎలా ఉంటుంది? ఉన్న సంపద పోయింది అని ధ్వనింపజేస్తూ పై మాటలన్నాడు. ఇక చివరి పంక్తి మనం సర్వకాల సర్వావస్థలలోనూ గుర్తుంచుకోవలసినట్టిది. చెప్పెద నా టెంకి అంటూ "సుజనులందు

తఱచుగ సాచ్చియుందు"అన్నాడు వామనుడు. కొంతమంది "దేవు(డు అందరివాడూ గదా! దొంగలబారిన పడకుండా నన్ను కాపాడమని ఒకడు మొక్కితే - నాకు మంచి దొంగ సొత్తు దొరకాలని దొంగ మొక్కుతాడు. దేవు(డు ఇద్దరి కోర్కెలూ ఎలా తీరుస్తాడు?" అని అడుగుతూ ఉంటారు- తెలుసుకోవాలనో, కొంటెగానో. దానికిదే తిరుగులేని సమాధానం. పరమాత్ముడు సర్వకాల సర్వావస్థలలోనూ సజ్జనులలోనే ఉంటాడు. "మరి సర్వజీవరాశిలోనూ ఉంటాండంటారు గదా! మళ్లీ యిదొక మెలికె పెడతారేం?" అనేది మరోప్రశ్న. ఆయన అన్ని జీవులలోనూ ఉండే మాట నిజమే. కానీ, ఆ జీవి ఆయనను గ్రహించి, తన మనసుపైనున్న పొరలన్నిటినీ తొలగించి ఆయన శక్తి ప్రజ్వలితమయ్యేలా చేసినప్పుడే ఆయన ఆ జీవులకు సహకరిస్తాడు. అట్టివారు సుజనులవుతారు. అంచేత సుజనులతోనే ఆయన సఖ్యం. ఇలాటి ఆణిముత్యాలవంటి పద్యాలతో నిండిన రత్నాకరం పోతనగారి భాగవతం.



# నమస్కారం

- మాతా శుకవాణి

'నమ' - అంటే వినయంతో వంగటం. కనుక నమస్కారం, నమస్సు- అంటే వినయంతో నీ మ్రోల వంగుతున్నాను- అనగా వినమ్రుడనవుతున్నాను- అని అర్థం. ఈ నమస్కారం మన భారతీయ మర్యాదలలో అత్యంత ముఖ్యమైనది. మూడు నాలుగు నెలలు దాటిన దగ్గరినుంచీ "రాంభజన చెప్పమ్మా! రాంరాం చెప్ప" అంటూ రెండు చేతులూ ఆనించి భజన చేయించటం మన అమ్మమ్మలూ, తాతమ్మలూ అందరికీ అలవాటు. అరచేతులలో వేళ్ల దిగువగా ఉన్న చిన్న చిన్న బుడిపెలు ఒకదానినొకటి తాకుతూ గట్టిగా కొడుతుంటే రక్తప్రసరణ బాగా జరుగుతుంది. మరోప్రక్క దైవనామ సంకీర్తనం జరిగినట్లూ అవుతుంది. బాల్యం నుంచే పెద్దవారికి





నమస్కారం చెప్పటం నేర్పతారు అమ్మమ్మలు, తాతయ్యలు. (ఒక చెయ్యి పైకెత్తి, కొట్టబోతున్నాడో-ఈగ తోలుకొంటున్నాడో తెలియనట్లు హాయ్ అనే దౌర్భాగ్యం గతంలో లేదు.) ఇప్పుడు మన వాళ్లు నమస్కారానికి బదులుగా 'ఇక ఫో' అంటూ 'బై' అనటం నేర్పతున్నారు.

రెండు అరచేతులూ జోడించి, బొటనవేళ్లు సప్తపథకు కొంచెం దిగువన తాకించి చేసే నమస్కారం ఎదుటివారి శక్తిని స్వీకరించడానికి పనికి వస్తుంది. ఇక్కడ రెండు బొటనవేళ్ల ద్వారా (పై వేళ్ల నుండి స్వీకరించిన) చిచ్ఛక్తి (ఆరా) మన లోపలికి స్వీకరించగలం. పైకి చూచే వేళ్లు యాంటెనాలాగా పనిచేస్తాయని సైన్సు. రెండు చేతులూ దోయిలించి, శిరస్సున కీలించి చేసే ప్రణామం మరింత ఫలవంతమవుతుంది. అంతకన్నా వినయం ఎక్కువైనపుడు మోకరించి, నుదురు నేలకు ఆనించి నమస్కరిస్తాము. ఆ స్థాయి యింకా పెరిగితే సాష్టాంగ నమస్కారం చేస్తాము. పొట్ట, కాళ్లు, చేతులు, నుదురు, చెవులు, ముఖం-మొత్తం నేలకు తాకేలాగా బోర్లబడి చేసే యీ నమస్కారం ఒకరకంగా ప్రతిజ్ఞ. 'నా చెవులు మీ పలుకులే ఆలకిస్తాయి- నా కళ్లు మిమ్మల్నే చూస్తాయి- నా చేతులు మీరు చెప్పిన పనే చేస్తాయి- నా పాదాలు మీరు చూపిన మార్గంలోనే నడుస్తాయి-నా ఉచ్ఛ్వాసనిశ్వాసాలు నీ స్మరణతోనే కదులుతాయి-యిలా మన శరీరమంతటితోనూ ప్రతిజ్ఞాపూర్వకంగా చేసే నమస్కారమే సాష్టాంగం. (స్త్రీలకు ఇది నిషిద్ధం-వారి కడుపు భాగం నేలకు తాకరాదు గనుక-కేవలం సైన్సు.)

వైష్ణవ శిష్యులు తమ గురువులకు నమస్కరించేటపుడు 'అడియేన్ దాసోకహం' అని కంఠోక్తిగా చెప్తారు. అంతేకాదు-గురువు తనవైపు చూచి ఆ నమస్కారం స్వీకరించాలనుకొనేంతవరకూ అలా పదేపదే సాష్టాంగ పడుతూనే ఉంటారు. అది శిష్యునిలో వినయాన్నీ, గురువు పట్ల అభిమాన

గాఢతను పెంచుతుందనీ వారి విశ్వాసం.

ప్రస్తుత ప్రపంచంలో స్నేహాదరాలు, ప్రేమాభిమానాలు కొరవడిపోతుండటంతో నమస్కార విధానాలలో కూడా తేడా వచ్చింది. తమకంటె ఉద్యోగంలో, సంపదలో, పదవుల్లో పెద్దగా ఉన్నవారికి మాత్రమే నమస్కారం చెప్పటం తప్ప-విద్యలో, వివేకంలో, వయసులో పెద్దగా ఉన్న వారిని మన్నించే అలవాట్లు తప్పిపోయాయి. ఆ చెప్పే వారికైనా అవసరార్థమో, ఎప్పుడైనా పనికి రాకపోతారా అనో తప్ప-'ఆ వ్యక్తిలో ఉన్న పరమపురుషునికే నమస్క రిస్తున్నాను' అన్న విజ్ఞతతో చేసేవి తక్కువ. చిన్నప్పుడెప్పుడో చదివాను- డా॥ సరోజినీనాయుడు తన కుమార్తె పద్మజానాయుడుతో ఇలా చెప్పారని- "నీ కంటె అవతలివారు పెద్దవారు. అంటే నీ కంటె చాలా ఎక్కువకాలంగా పరమాత్మ శక్తిని మోస్తున్నారు తమలో. అందుచేత వినయంతో నమస్కరించాలి". ఈ భావన నేటి నమస్కారాలలో ఎంత శాతం ఉన్నదో మనకు తెలుసు.

శ్రీ సాయి సచ్చరిత్రలో నమస్కారం గురించిన ఒక చిన్న చక్కని ఐతిహ్యం ఉన్నది. మదరాసు నుండీ భజన సమాజం వారు కొందరు బాబా దగ్గరకు దక్షిణలు ఆశించి వచ్చారు. వారిలో ఉన్న ఒక ఇల్లాలు బాబాలో శ్రీరాముని దర్శించగలిగింది. కానీ ఆమె భర్త ఆమె అనుభవాన్ని నమ్మలేదు. ఇలా ఉండగా ఒకనాటి రాత్రి అతనికొక విచిత్ర దృశ్యం అగుపించింది. అందులో పోలీసులు తనను బంధించారు. 'నేనే పాపమూ చెయ్యలేదు-నాకీ శిక్ష ఎందుకు?' అని అతడు బాబాను అడిగాడు. 'గత జన్మ పాపాలున్నాయేమో!" అన్నారు బాబా. 'ఆ పాపాలు నీవెందుకు దహింపరాదు?' అనే వేడుకొన్నాడు అతడు. 'నీవు తప్ప వేరెవ్వరూ నన్ను రక్షింపలేరని దీనంగా ప్రార్థించగా బాబా "నీకు విశ్వాసం ఉందా?" అని అడిగారు. తరువాత పోలీసులు రక్తం కారుతూ క్రింద పడిపోగా "నీ మీదికే యీ





నేరం వస్తుంది" అన్నారు బాబా. మనవాడు తనను ఎలాగైనా కాపాడమని వేడుకోగా బాబా అతన్ని కళ్లు మూసుకొమ్మన్నారు. కాస్సేపటికి అతను కళ్లు తెరిచేసరికి తాను బంధవిముక్తుడయ్యాడని గ్రహించి బాబా పాదాల మీద పడ్డాడు.

"నీవు మునుపు చేసిన నమస్కారానికీ, యిప్పటి యీ నమస్కారానికీ ఏమైనా భేదం ఉందా? ఆలోచించి చెప్పు" అన్నారు బాబా. అతడు నిజాయితీగా చెప్పాడు. "కావలసినంత భేదం ఉంది. ఆ నమస్కారాలన్నీ నీ దగ్గర డబ్బు ఆశించి, ప్రయోజనం ఆశించి చేసినవి. ఈ నమస్కారం నిన్ను దైవస్వరూపుడిగా భావించి చేసినది".

అదీ మన ప్రవృత్తి. దేవు(డికైనా సరే మర్యాదాపూర్వక నమస్కారం ఒకటీ, అవసర నమస్కారం ఒకటీ, (కేజువల్) ఏదో అలా అలవాటు నమస్కారం ఒకటీ-అలా రకరకాలు చేయగలం. ఇక మనుషులు మనకో లెక్కా! మనసులో ఎంత వ్యతిరిక్తత ఉన్నా దాన్ని దాచుకొని 'నమస్కారం' అని ఒక బాణం అలా విసరగలం. (ఆద్యంతాలు విరిచేసి మధ్య రెండక్షరాలు మాత్రమే మనసులోంచీ వచ్చేది) కొరడాతో కొట్టినట్లో, ఏమాత్రం తడి లేకుండానో, వ్యంగ్యంగా దీర్ఘాలు తీస్తూనో, ఎన్నెన్ని రకాల వైవిధ్యభరిత నమస్కారాలో! మనం చెప్పకపోయినా ఎవ్వరూ కొట్టరు. అలాటి వక్రప్రక్రియలతో లేని పాపం మూట కట్టుకోవటం దేనికీ? నిర్మలచిత్తంతో, ప్రేమ భావంతో, స్నేహభరితంగా, ప్రఫుల్లంగా చేసేదే సరైన నమస్కారం. అది మన లోపలి చేదును విరిచి, హృదయ మార్దవాన్ని పెంచుతుంది. స్నేహ సౌహార్దాలతో మనుష్యులను బంధిస్తుంది. గురువులకు చేసే నమస్కారం శ్రేయస్సును, చుట్టూ ఉన్న వారికి చేసే నమస్కారం ప్రేయస్సునూ పెంచుతాయి. అలాటి నిర్మల వందనరీతిని అలవరచుకుందాం.



ఓం శ్రీ సాయిరాం

# షిరిడీ డైరీ

- మాన్యశ్రీ జి.ఎస్. కపర్దే

అనువాదం : మాతా శుకవాణి

(గత సంచిక తరువాయి)

30-12-1911

ఉదయం ప్రార్థన తరువాత నా కొడుకు బాబాకు ఒకటీ భావూదురానీకొకటీ మరో రెండు నెలల వరకు నేను రాకపోవచ్చునని ఉత్తరాలు వ్రాసాను. నటేకర్ రాధాకృష్ణ ఆయి దగ్గరకు వెళ్లాడు. ఆమె లేనట్లుంది. అతనక్కడ ప్రశాంతంగా, హాయిగా రోజంతా గడిపివచ్చాడు. నేను ఉదయం రామాయణం చదివాను. మధ్యాహ్నం భాగవతం విన్నాను. సూర్యాస్తమయానికి కొద్దిగా ముందుగా సాయి మహరాజు దగ్గరకు వెళ్లాను. ఆయన నన్ను సాదరంగా పేరు పెట్టి పిలిచి, ఓర్పుకు ఉన్న గొప్పతనం గురించి చిన్న కథ చెప్పారు. ఒకప్పుడు తాను అలా పర్యటన చేస్తూ, చేస్తూ ఔరంగాబాదు వెళ్లారట. అక్కడ మసీదుకు దగ్గర్లో ఒక చాలా పొడవైన చింతచెట్టు దగ్గర ఒక ఫకీరు కన్పించాడట. ఫకీరు తనను మొదట ఆ మసీదులోకి వెళ్లనివ్వలేదుగానీ తరువాత అక్కడ ఉండనివ్వడానికి ఒప్పుకొన్నాడుట. ప్రతిరోజా మధ్యాహ్నవేళ ఒక వృద్ధురాలు తెచ్చిచ్చే రొట్టెముక్కే ఆ ఫకీరుకు రోజంతటికీ ఆధారం. సాయి మహరాజు తమంతట తామే భిక్షాటన చేసి ఆహారం తెచ్చి ఆ ఫకీరును పోషించసాగాడు. అలా పన్నెండేళ్లు గడిచిపోయాక తాము ఆ చోటు విడిచి వెళ్లిపోదలచు కొన్నారట. ఆ వృద్ధ ఫకీరు కన్నీటితో బాధపడుతూ వీడ్కొలిపాడట. సాయి మహరాజు ఆయనను ఓదార్చి వెళ్లి





పోయారట. నాలుగేళ్ల తరువాత మళ్లీ ఆయనను చూడడానికి వెడితే ఆయన బాగానే ఉన్నాడట. ఆ ఫకీరు కొద్ది సంవత్సరాల క్రితం యిక్కడికి వచ్చి చావడిలో ఉన్నాడట. మాతగా బాబా ఫకీరును చూచుకొన్నాడట. దీన్నిబట్టి నాకు అర్థమైంది ఏమిటంటే -సాయి మహరాజు పన్నెండేళ్లపాటు ఔరంగా బాదులో ఉండి, ఆ ఫకీరు ఆధ్యాత్మిక స్థాయి పరిపూర్ణం చేసారని. ఆ రాత్రి భజన, రామాయణ పఠనం జరిగాయి. నటేకర్ కూడా ఒక అధ్యాయం చదివాడు.

31-12-1911

పెందలకడనే లేచి ప్రార్థన తరువాత వరండాలో తిరుగుతోంటే హంస క్రిందికి వచ్చాడు. రాత్రి తనకు నిద్రపట్టక అలా ఖండోబా దేవాలయం దాకా తిరిగి వచ్చాననీ, అటుపైన రాధాకృష్ణ మాయి యింటిలోంచీ ఏవైనా (ఆమె) ప్రార్థనలు వినబడతాయేమోనని అటు వెళ్లాననీ, ఇంట్లో ఎవరూ కదిలిన సవ్వడేమీ వినరాలేదనీ చెప్పాడు. అంచేత గ్రామ పొలిమేర వరకూ నడిచి వచ్చాడట. కాస్సేపటి తరువాత మళ్లీ రాధాకృష్ణ మాయి దగ్గరికి వెళ్లాడు. ఆమె దయతో అతనికి సహకరించింది. అతను స్నానం చేసి, సాయి మహరాజు ఆమె కోసం పంపిన ప్రసాదంలో కొంత తిన్నాడట. నేను అతనితో మాట్లాడుతూ నిలబడ్డాను. అతను మళ్లీ రాధాకృష్ణ మాయి దగ్గరికి వెళ్లాడు - వీడ్కోలు చెప్పడానికి. ఆమె అతనికొక ధోవతి, చొక్కా ప్రసాదంగా యిచ్చింది. అతడు తనతో ఉన్న ముగ్గురు యువకులతో కలిసి బొంబాయి తిరిగి వెళ్లాడు. వాళ్లలో ఒకడి పేరు రేగే. ఇదంతా నా పనులన్నిటినీ ఆలస్యం చేసింది. ఇంకేమైనా ఉంటే మంగలాయన మరీ ఆలస్యం చేసాడు. సాయిబాబా బయటికి వెడుతుండగా చూచానుగానీ, ఆయన ఎవ్వర్నీ తన దగ్గరకు వెళ్లి నమస్కారం చెయ్యనీయలేదు. తరువాత నేను మసీదుకు వెళ్లి మధ్యాహ్న పూజ కోసం కూర్చున్నాను. హారతి వేళలో మగవాళ్లంతా వేదిక వదిలి క్రింద నిలబడవలసి వచ్చింది. ఏర్పాట్లు బాగున్నాయి. మసీదంతా ఆడవాళ్లే నిండిపోయారు. నేను తిరిగి వచ్చి కోపర్గావ్ మామ్లేదారు వస్తే ఆయనతో

మాట్లాడుతూ ఉన్నాను. తరువాత దహనుగ్రామ మామ్లేదారు అయిన దేవ్ కూడా వచ్చాడు. నానాసాహెబ్ చందోర్కర్ హారతికి ముందర వచ్చాడు. మా ఉదయ భోజనం మామూలుగానే రెండుగంటలకయింది. దాని తరువాత యీ వేళ్టి వార్తాపత్రికలు చదువుతూ కూర్చున్నాను. సాయంత్రం కావస్తుంటే నేను మసీదుకు వెళ్లానుగానీ - సాయి మహరాజు త్వరగానే ఊదీ యిచ్చేసారు. దానితో నేను క్రొత్త భవనం మీద కూర్చొని, గోవర్ధనదాసుతో కలిసి ఉండే గుజరాతీ శాస్త్రితో మాట్లాడాను. నేను బాబాకు సాయం వాహ్యాళి సమయంలోనూ, శేజారతి వేళ కూడా నమస్కరించుకొన్నాను.

**(సశేషం)**



# శ్రీ సాయి-సేవ



## శ్రీసాయి సేవ అవసరమా?

**– సాయివాణీ ప్రచురణలు**

**(గత సంచిక తరువాయి)**

### సేవ - వయసు

సేవ చెయ్యడానికి వయస్సుతో ఏ సంబంధమూ ఉండదు. సేవ పొందే వాళ్లకూ ఉండదు - చేసేవారికీ ఉండదు. ఐదేళ్ల పిల్లవాడు మొదలు డెబ్బై, ఎనభై ఏళ్ళ వృద్ధుల వరకు సేవారంగంలోకి వస్తున్నారు. అయితే మొట్టమొదట మనం ఎవరికి సేవ చెయ్యాలనేది స్పష్టంగా ఉండాలని యింతకుముందు అనుకొన్నాం గదా. అది వేరే కథ. అయినా ఓసారి స్మరించుకొని ముందుకు వెడదాం.

వినయబాల మొన్నమొన్ననే ఎల్.కె.జి. దాటి యు.కె.జి.లోకి వచ్చింది. వాళ్ల టీచరుగారు మోరల్ ఇన్‌స్ట్రక్షన్ (నీతిబోధ) క్లాసులో మంచి విషయాలు చెప్తూ - "మనం ఎవరికైనా సహాయం చెయ్యాలి. పెద్దవాళ్లకు





చేస్తే 'సేవ' అంటారు. అలా మనం చేసే సేవ చేస్తే దేవుడికి బోలెడంత యిష్టం కలుగుతుంది మన మీద" అని చెప్పారు. వెంటనే పిల్లలు "అంటే ఏం చెయ్యాలి టీచర్?" అని అడిగారు.

"ఒక పెద్దావిడ ఎవరైనా రోడ్డు దాటలేక శ్రమపడుతున్నారనుకోండి. అప్పుడు చెయ్యి పట్టుకొని దాటించాలి. ఎవరైనా పిల్లలు క్రింద పడిపోతే వెంటనే లేవదీయాలి - అలాగన్నమాట" అన్నారు టీచర్. సరేనన్నట్లు తల లూపారు అందరూ.

రెండు రోజుల తరువాత వినయబాల, కృష్ణయ్య బడికి ఆలస్యంగా వచ్చారు. కారణం అడిగారు టీచర్. ఒక ముసలి మామ్మగారు రోడ్డు దాటుతోంటే సాయం చేసి వచ్చేటప్పటికి ఆలస్యమైందన్నది వినయ.

"రోడ్డు దాటడానికి పావుగంట పట్టిందా .... ఇంత లేటయ్యావు" అన్నారు టీచర్. "నేను చెయ్యి పట్టుకున్నాను టీచర్‌గారండీ! ఆ మామ్మగారేమో విదిలించుకొంటున్నారు. నేను రానంటే రానన్నారు. ఎలాగోలాగ లాక్కువెళ్లి రోడ్డు దాటించేసి వచ్చాం టీచర్‌గారండీ!" అన్నారు పిల్లలిద్దరూ కోరస్‌గా.

టీచర్‌కు అర్థమైంది - అసలా పెద్దావిడ రోడ్డు దాటనక్కరలేదు. ఆమె త్రోవన ఆమె వెడుతోంటే ఈ పిల్లలు ఆమెను బలవంతంగా రోడ్డు దాటించారన్న మాట. పాపం వీళ్ల పోరు పడలేక ఆమె ఎవరో - ఇటువచ్చి మళ్లీ అటు వెళ్లిపోయి ఉంటుంది. ఇదిగో మనం చేసే సేవ యిలా ఉంటుందేమో ... చూచుకోవలసిన అవసరం కూడా లేకపోలేదు - కనీసం పిల్లలు.

ఆసుపత్రులలో పళ్లు పంచితే మంచిదే-కార్పొరేటెడ్ ఆసుపత్రుల్లో అవసరమా! బాగా చదువుకొనే పిల్లలనే చదివిస్తామంటారు కొందరు. లేకపోతే వ్యర్థమవుతుందని భయం-నిజమే. కానీ, అలాటి పిల్లలను కాలేజీలే చదివిస్తున్నాయి గదా అనేకచోట్ల. ఇవన్నీ ఆలోచించదగిన విషయాలు.

చిన్నజీవులు శక్తి లేకపోయినా తమకున్న పరిధిలోనే ఏదైనా మంచి

చెయ్యాలని ప్రయత్నించటం చాలా ఉత్తమ విషయమనీ, దాన్ని పరమాత్ముడు మెచ్చుతాడనీ రామాయణంలోని ఉడత కథ ఋజువు చేస్తుంది. అది ఆకారానికీ, శక్తికీ కూడా చాలా చిన్నది. మహాబలశాలురైన వానరులు వారధి నిమిత్తం పెద్దపెద్ద రాళ్లను, చిన్నచిన్న గుట్టలను కూడా ఎత్తి నీళ్లలో పడవెయ్యటం చూచింది.

రాక్షస వధార్థం వానసైన్యం లంకకు వెళ్లడానికి వీలుగా కడుతున్న వారధి అని విన్నది. గుండ్రని ఆ శిలల మధ్యనున్న ఖాళీలలో కోతుల కాళ్లో, తోకలో పడితే కష్టం కదా అనుకొన్నది. వెంటనే ఓ చిన్నరాయి తలమీద పెట్టుకొని చాలా కష్టం మీద మోస్తూ వెళ్లి నీళ్లలో పడేసింది పెద్దరాళ్ల మధ్య. ఒకటి .... రెండు .... మూడు..... పది.... ఉడత అలసిపోయింది. ఇక తాను యెత్తలేదు. నీటిలో మునిగి లేచింది. ఇసుకలో దొర్లింది. ఒంటికంతా యిసుక అంటింది. ఆ పళంగా వచ్చి రాళ్ల సందుల్లో దులిపింది. మళ్లీ పరుగెత్తి ఒళ్లు తడుపుకోవటం, ఇసుకలో దొర్లటం - ఆ యిసుక తెచ్చి వారధి మీద విదిలించటం ....

శ్రీరామచంద్రమూర్తి ఆ చిట్టి ఉడత పడుతున్న హైరానా చూచాడు. చెంతకు రమ్మని పిలిచాడు. దాన్ని తన ఎడమ అరచేతిలో ఉంచుకొన్నాడు. కుడిచేతితో దాని వీపు మీద మెల్లగా, మెత్తగా నిమిరాడు. నాటికీ, నేటికీ ఆ పరమపావనమైన వేళ్ల గురుతులు అలా ఉండిపోయాయి. ఉడతవెన్నున.

శ్రీరామునికి ప్రియభక్తుడు ఆంజనేయుడు. ప్రియసఖుడు సుగ్రీవుడు. ప్రాణప్రదమైన తమ్ములు భరత లక్ష్మణులు. వీరెవ్వరి వెన్నునా అంత అభిమానంతో ఆప్యాయంగా కదలని శ్రీరామాంగుళులు ఈ చిన్నారి ఉడత వీపున ఎందుకు కదలాడినట్లు? తన శక్తి ఎంత తక్కువైనా సరే ప్రభు కార్యానికి వెనుకాడలేదు. సమాజ శ్రేయస్సు కోసం తనకు తోచిన రీతిలో సేవ కోసం వచ్చింది. అందుకే దాని మీద ప్రేమ పొంగి వచ్చింది రామయ్యకు.

**(సశేషం)**





# మాతృసంస్థ కబుర్లు

ఫిబ్రవరి 19వ తేదీ ఉదయం పరమపూజ్య గురుదేవులు తమ బృందంతో మిర్యాలగూడెం ప్రక్కనే మూడు కిలోమీటర్ల దూరంలో వున్న వెంకట్రాదిపురం గ్రామంలో శ్రీ సాయినాథ దేవాలయానికి శిఖర కలశ స్థాపనకై వేంచేశారు. ఉదయం గం.9.40 ని.లకు ముహూర్తం. గ్రామ చిన్నది కావటంచేత భక్తుల సంఖ్య పలుచగా ఉన్నప్పటికీ కార్యక్రమం చక్కగా శాస్త్రోక్తంగానే నడిచింది. కలశ స్థాపన తర్వాత గురుదేవులు దేవాలయ విశిష్టతను, కలశం వెనుక ఉన్న సైన్సును వివరించి చెప్పగా-మాతాజీ నిత్యం దైవస్మరణ చేసుకోవలసిన ఆవశ్యకతను గురించి విపులీకరించారు. అటుపైన ఆలయ నిర్వాహకులు సముచితరీతిన గురుదేవులను సత్కరించుకున్నారు.

అక్కడినుండి బయలుదేరి గురుదేవులు మధ్యాహ్నం గం.1.30లకు కల్లా సత్తెనపల్లి చేరుకున్నారు. అక్కడ నిర్మాణంలోవున్న 'శ్రీ ఆనందసాయి ప్రభు' దేవాలయం తీరుతెన్నులు పరిశీలించాక భోజనాదికాలు కానిచ్చుకుని కొద్దిగా విశ్రాంతి తీసుకున్నారు. సాయినాథ క్షేత్రం నుంచి వచ్చిన చిరంజీవి సాయిరమణ కూడా మా గుంపులో కలిసిపోయాడు. తదుపరి అదే ఆవరణలో నిర్మితంకానున్న అతిథి మందిరానికి పిల్లర్ల కోసం జరుగుతున్న ఏర్పాట్లు పర్యవేక్షించారు. చూడవచ్చిన కొద్దిమంది భక్తులతో ముచ్చటించారు. చీకటి పడింది. ఇక మశక-మానవ యుద్ధకాండ మొదలు. దోమతెరలు, ఫ్యాన్లు, దోమ సంహారక బ్యాట్లు వీటన్నింటిని తమ జంట రెక్కలతో, ఒంటి ముక్కుతో ఎదుర్కొంటూ వైరి వర్గం చేసిన వీరవిహారం ముందు మానవాళి చేతులెత్తేసి నిద్రకు మంగళహారతి పాడక తప్పలేదు.

మర్నాటి ఉదయం పుట్టింగులు పోసే పనికి గురుదేవులు విభూతి చల్లి ఆరంభించారు. శ్రీ రామయ్యగారు, ఆనందంగారు వగైరాలు కొబ్బరి కాయలు కొట్టగా, బ్రహ్మారెడ్డి ముత్యాలుల పర్యవేక్షణలో పని ప్రారంభమైంది. మధ్యాహ్నం ఒంటిగంటన్నరకల్లా పూర్తయింది. ఈలోపల రామూ, రామయ్యగారు, ఆనందంగారు టౌన్‌లోకి వెళ్ళి నిర్మాణానికి కావలసిన స్టీలు కొనుగోలు చేసి తెచ్చారు. సాయిరమణ పుట్టింగు పని పర్యవేక్షిస్తూ ఉండిపోయాడు. అలాఅలా అన్ని పనులు అయిపొయ్యే సరికి సాయంత్రం ఐదు గంటలు అయింది. తిరుగుప్రయాణం ప్రారంభమైంది. రాత్రి పది గంటలకు ఆశ్రమం చేరుకుని హమ్మయ్య అనుకున్నాం.

మార్చి 14వ తేదీన సత్తెనపల్లిలో గెస్టుహౌస్ 'ఆదిత్య'కు ద్వారబంధాలెత్తే పని వచ్చింది. మాతాజీ ప్రయాణాలు చేసే స్థితిలో లేరు. మరి ద్వారబంధానికి పసుపు, కుంకుమలు పెట్టి, తోరణం కట్టేదెవరు! 'మన ఆశ్రమం ఆడపడుచులను ఎవరో ఒకళ్ళను తీసుకెళ్ళరా!' అన్నారు మాతాజీ. ఇంకేముంది! పోలోమని చైత్ర, సుధీర బయలుదేరారు. అమ్మలును కూడా రమ్మన్నాడు రామన్న. 'అప్పుడోసారి అన్నలందరినీ తీసుకువెళ్ళారు. నన్ను వద్దన్నారు' అని బుంగబూతి పెట్టుకుని నిలబడ్డాడు మురళి. సరే వాడిని కూడా వెళ్ళమన్నారు. మొత్తం నలుగురిని వెంటేసుకుని పిల్లల కోడిలాగా బయలేర్దాడు రామన్న. ఓ రోజంతా యథేచ్ఛగా సత్తెనపల్లి ఆశ్రమమంతా ఓ కొలిక్కితెచ్చి ఎదురుగా ఉన్న వీరాస్వామి హోటల్‌లోని ఇడ్లీలు, బోండాలు వగైరాలు రుచిచూచి, అటుపై ద్వారబంధానికి అలంకారాలు చేసి, పూజించి, కొబ్బరికాయలు కొట్టి ద్వారబంధం నిలిపాక, తిరుగు ప్రయాణమై ఇల్లు చేరారు వానరులంతా.

మార్చి 17వ తేదీ వేకువఝామునే ఆశ్రమంలో కోలాహలం మొదలైంది- హోలీరంగులతో కాదు, గురుదేవుల జన్మదినం మరునాడే నన్న ఉత్సాహపు పొంగులతో. ప్రాంగణం, దేవాలయం, కళ్యాణి శుభ్రం చేసుకోవటం, సరుకులు తెచ్చుకోవడం, కూరగాయలు మోసుకు రావడం,





పూలు సమకూర్చుకోవడం వగైరా పనులతో మగపిల్లలు కష్టపడుతోంటే- మరునాటి వంటకాల ప్రణాళిక, పిల్లలకు పంచవలసిన ప్రసాదాల తయారీ వగైరాలతో ఆడపిల్లలు హైరానాపడసాగారు. ఉదయం గం.7ల నుండి మాతాజీ పిల్లలను కూర్చోబెట్టి సాయిచాలీసా 108 ఆవర్తాలు చదివించారు. అంతలో 9 గం.లయింది. బడిపిల్లలందరూ వచ్చేసారు. వారందరు గత 6 రోజులుగా సాయంత్రం వేళలో సాయినాథ చరిత్ర పారాయణ చేసి ఉన్నారు. ఆ రోజు ఆఖరి రోజు కనుక అందరూ శుభ్రంగా, శుచిగా వచ్చారు. మాతాజీ హైస్కూల్ పిల్లలను కూర్చోబెట్టి ఒక్కొక్క శబ్దం చెప్తూ వాళ్ళ చేత వెయ్యిన్నీ ఎనిమిదిసార్లు మహా మృత్యుంజయ మంత్రం పలికించారు. (చివరికి వచ్చేటప్పటికి వాళ్ళందరికీ కంఠస్థం కూడా వచ్చేసింది.)

అటుపైన విష్ణు సహస్రనామం కూడా ఆశ్రమబాలబాలికలు ఏకధాటిగా చదువుకు వెళ్ళిపోగా మిగిలిన వారిచేత ప్రతి పదం పలికిస్తూ చదివించారు మాతాజీ. పదిన్నర గంటలవడంతో నలుగురైదుగురు వృద్ధాశ్రమ సభ్యులు కూడా వచ్చి చేరడంతో 58 ఆవర్తాల కన్నా ఎక్కువగానే విష్ణుసహస్రనామం పూర్తయింది. మధ్యాహ్నం తర్వాత వాళ్ళు ప్రతిరోజూ చేసే సమయానికి 7వ రోజు పారాయణ కూడా చేసి చరిత్ర పఠనం పూర్తిచేసారు పిల్లలు. ఆ తరువాత తరగతులవారీగా పిల్లలంతా వచ్చి గురుదేవులకు నమస్కారం చేసుకొని ఆశీస్సులు తీసుకున్నారు. మొత్తం 350 మంది పిల్లలకూ గీత, మంజుల, పాపాయి మొదలైనవారు లడ్డూలు, చేతినిండా పులిహోర పెట్టి పంపించారు.

ఆ సాయంత్రం అనుకోకుండా నల్గొండ నుంచి స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో పనిచేసే శ్రీ వేణుగోపాలరావుగారు, ఆయన ఇల్లాలు-యూసఫ్ గూడాలో అదే శాఖలో పనిచేస్తున్న శ్రీ రవికుమార్ దంపతులు రావడం ఎంతో సంతోషాన్ని కలిగించింది. మరికొంచెంసేపటికి శ్రీ కిశోర్‌చంద్ చొరాడియా కంటి ఆసుపత్రిలో కస్టోడియన్‌గా పనిచేస్తున్న శ్రీ పి.రాఘ

వేంద్రప్రసాద్‌గారు, వారి ఇల్లాలు కూడా రావడంతో పండుగ ఒకరోజు ముందే వచ్చినట్లయింది. ఆశ్రమం నుండి వెళ్ళిన ప్రతి ఒక్కరికీ ఎంతో ఆదరాభిమానాలతో వైద్యసహాయం అందించే ప్రసాద్‌గారంటే అందరికీ అభిమానమే. వేణుగారు, రవిగారు, ప్రసాద్‌గారు అందరు ఆశ్రమం నలు మూలలా చూచి వచ్చి, గురుదేవుల చెంత కొంతసేపు గడిపి ఆనందించారు. అతిథులందరికీ గీతక్క, పాపాయి భోజనాలు వడ్డించారు. ఆ తరువాత పుష్పగారు కొంతసేపు కూరగాయలు కొయ్యడంలో సహాయం చేసారు కూడా. దాదాపు 9 గం.ల వేళ అందరినీ సాగనంపి కూరగాయల ఖండనంలో పడ్డారు అమ్మాయిలంతా. అబ్బాయిలంతా మరునాడు కళ్యాణి భవనంలో వడ్డనల కోసం కావలసిన సామగ్రిని చేరవేయడంలోనూ, నీళ్ళ డ్రమ్ములు నింపడంలోనూ మునిగిపోయారు.

18వ తేదీ ఉదయం హడావుడిగా మొదలయింది. రాత్రే వచ్చిన డా॥ఝాన్సీ అత్తయ్య, స్వర్ణత్తయ్య ఒక పచ్చడి చేస్తే ఆశ్రమం ఆడపిల్లలంతా కలిసి పప్పు, కూర, సాంబారు, టిఫిను, మరో చట్నీ, పులిహోర, స్వీటు వగైరాలు చేసేశారు-టీచర్ల సహాయంతో. చూస్తూ చూస్తూ 10 గం.లు కావచ్చింది. ఒకరొకరుగా వస్తున్న భక్తులంతా అల్పాహారాలు చేసేసారు. అంతలో బ్రహ్మారెడ్డి తన అలవాటు ప్రకారం ఓ పెద్ద కేకు మోసుకొచ్చాడు. దానిని గురువుగారిచేత కోయించాల్సిందే అని పట్టుపట్టాడు. పిల్లకుంక లంతా ఆయనకు ఓటేసారు. దానితో గురువుగారికి 'సరే' అనక తప్పలేదు. ఆ పని అయ్యాక అందరూ తరలి గుడికి వెళ్ళారు. అనపర్తి, తెనాలి, విజయవాడ మొదలైన చోట్ల నుండి వచ్చిన భక్తులు, సత్సంగ శాఖల నుండి వచ్చిన భక్తులతోనహా గ్రామీణులు కూడా అక్కడ సమావేశమయ్యారు. గం.8లకే వచ్చి స్వామి సన్నిధిలో భజనలు వినిపించిన ఉద్దమర్రి భక్తులు, వారమంతా పారాయణం చేసి, ఆ చేసిన గ్రంథాలను పోతీ కట్టి తెచ్చిన కాజీపేట, బొమ్మల రామవరం, హాజీపూర్ మొదలైన గ్రామాల భక్తులు రకరకాల స్తోత్రాలు చేసిన పిల్లలు కూడా,





పారాయణఫలాన్ని గురువుగారి క్షేమార్థం ధారపోసారు. ఆ తరువాత కొద్ది గురుస్తుతి, తరువాత రాంబాబు చేత గురుదేవులకు అష్టోత్తర శతనామ పూజ చేయబడ్డాయి.

శ్రీ సాయినాథ చరితామృతం 5వ ఎడిషన్ శ్రీశ్రీశ్రీ పరమపూజ్య గురుదేవుల కరకమలాల ద్వారా ఆవిష్కరించబడింది. తరువాత మాతాజీ మాట్లాడుతూ "మనుష్యుల్లో మూడు వంతుల మంది తామెందుకు పుట్టారో, ఎందుకు బ్రతకాలో ఏమీ ఆలోచించకుండా కేవలం "ప్రాణమా, త్రాగుము- తినుము-సుఖింపుము" అన్నట్లుగా బ్రతుకుతారు. మిగిలిన పావులో సగ భాగం "అయ్యో, సంసారాల్లో మునిగితేలుతూ వ్యర్థంగా గడుపుతున్నామే- ముక్తిమార్గంలోకి వెళ్ళలేకపోతున్నామే" అని విచారిస్తూనే తిరిగి అందులోనే కూరుకుపోతూ, దానికేవో సవాలక్ష కుంటి కారణాలు చెప్పకొంటూ గడిపేస్తుంటారు. ఇక మిగిలిన వారిలో సగభాగం ఆ సంసారలంపటంలోంచి బయటపడే ప్రయత్నం చేస్తారు. కొంతదూరం వస్తారు. కానీ దారితప్పటమో, వక్రంగా పోవటమో, పైకి సంసారంలో లేనట్లున్నాగానీ మమకారాలు వదల లేకపోవటమో చేస్తారు. ఇంక ఆ మిగిలిన అతి కొద్దిమంది మాత్రం సత్య పథంలో, ధర్మమార్గంలో నడుస్తూ మానవజీవిత పరమలక్ష్యాన్ని గుర్తించి, ఆ లక్ష్యంవైపే స్థిరంగా అడుగులు వేస్తూ తమతోపాటు ఇతరులను కూడా తీసుకువెడతారు. అలాంటి పుణ్యమూర్తులు గురువులుగా దొరకటం మహద్భాగ్యం. అట్టి గురుదర్శనం కనీసం ఏడాదిలో ముమ్మారు-గురు జన్మదినం, తన దీక్షాదినం, గురుపూర్ణిమ-ఈ మూడుసార్లు తప్పక చేసుకోవాలని పెద్దలు చెప్తారు. వాటిలో ఒక శుభదినం యిది" అన్నారు. అటుపైన గురుదేవులు ప్రవచిస్తూ-

"మానవజన్మ పొందటానికి తన పుణ్యమంతా ధారపోసి కొనుక్కున్నాం. దాన్ని ఎంత ఫలవంతంగా ఉపయోగించుకోవాలన్నది మనం నిర్ణయించుకోవాలి. అనాదికాలంగా మన శాస్త్రాలన్నీ, పెద్దలంతా చెప్తూనే ఉన్నారు- పోయేనాడు మానవుని వెంట ఏవీ రావని. అది మనం ప్రత్యక్షంగా

చూస్తూనే ఉన్నాం కూడా. కానీ ఎప్పటికప్పుడు మర్చిపోతూనే ఉంటాం. తనువు మట్టిలో కలిసిపోతుంది. సంపద ఎవరికో దక్కుతుంది. విద్య మనతోనే నశిస్తుంది. ఇక కీర్తి కొంతకాలం ఉంటుంది - తరువాత కాల ప్రవాహంలో కరిగిపోతుంది. మరి, మనతో వచ్చేదేమిటి? మనం చేసిన పాపపుణ్యాలు మాత్రమే. అందరికీ పుణ్యమే కావాలని ఉంటుంది. కానీ పుణ్యప్రదమైన కార్యాలు చేయరు. పాపకర్మలు విడువరు. చూస్తూ చూస్తుండగానే కాలం కరిగిపోతుంది. వృద్ధాప్యం ముంచుకువస్తుంది. మోకాళ్లు వంగవు. స్థిరంగా కూర్చోలేము. కళ్లు సరిగ్గా కనిపించవు. నామం పలకాలంటే చొంగకారుతుంటుంది. ఆ దశలో ఏం చెయ్యగలం? అందు చేత ముందే మేలుకోవాలి.

శ్రీ సాయిబాబావారు అతి సామాన్యులకు కూడా వీలయ్యే సాధనలను చెప్పారు. భగవద్గీతలో భక్తియోగం, రాజయోగం, కర్మయోగం, జ్ఞాన యోగం విడివిడిగా చెప్పబడినాయి. బాబావారు ఆ నాలుగు రీతులూ కూడా కలిపి సముచ్చయయోగం బోధించారు. అన్నింటినీ ఆచరించలేక పోయినా, "నిరంతరం నన్నే స్మరిస్తూ ఉండు. నీవు ఏది స్వీకరించినా మొదట నాకు సమర్పించు"-యీ రెండు మాటలూ ఆచరించగలిగినా చాలు. క్రమక్రమంగా ఎవరిని చూచినా, ఏ జీవిని చూచినా బాబానే వారిలో చూడగలిగే వక్తి వస్తుంది. అంతకంటే మహద్భాగ్యం ఏమున్నది? (ఈ మాటలంటున్నపుడు గురుదేవుల కంఠం గద్గదమై కన్నీరు పొంగి ఒక్క క్షణం మాట్లాడలేకపోయారు.) అందుచేత శ్రీ సాయి సచ్చరిత్ర చదవండి. వారి బోధనలు ఆచరించి ధన్యులు కండి" అని ప్రబోధించారు.


అటుపైన మాతాజీ రానున్న ఎన్నికలలో ధర్మపరులను మాత్రమే ఎన్నుకో వలసిన ఆవశ్యకత గురించి వివరించారు. అనపర్తి నుండీ వచ్చిన శ్రీ దేవానందరెడ్డిగారు, డిఫెన్స్ కాలనీ నుండీ వచ్చిన శ్రీమతి లక్ష్మిగారు, శ్రీ ఎస్.కె.లక్ష్మణరావుగారు గురుదేవులతో తమ అనుభవాలను వివరిం చారు. అప్పటికి హారతివేళయింది. అందరూ సాయికి హారతులు పాడి,





గురుదేవులకు నమస్కరించి, ఆశీస్సులు అందుకొన్నారు. తరువాత 'సాయి కళ్యాణి' ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన భోజనాలు స్వీకరించి, భక్తులంతా ఆనంద భరిత హృదయాలతో తిరిగివెళ్ళారు.

ఆ రాత్రి పదిగంటలకు గురుదేవులు రాంబాబు, ఆనందంగారు, రామ కోటేశ్వర్రావు, పద్మజ వెంటరాగా నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌లో పెదపట్నం బయలు దేరారు. ఆశ్రమానికి-ముఖ్యంగా గురుదేవులకు చిరకాలం అభిమానుల యిన శ్రీ కె.కృష్ణారావుగారు, వారి శ్రీమతి శేషారత్నంలు పెదపట్నంలో పెద్ద ఎత్తున సాయిదేవాలయ నిర్మాణం తలపెట్టి, పరమపూజ్యగురుదేవుల చేతనే శంకుస్థాపన చేయించి ఏడాదో, ఏణ్ణర్థమో అయింది. ఆరోజే గురుదేవులు 'సంవత్సరం లోపలే యిది పూర్తవుతుంద'న్నారు. అలాగే అది చకచక నిర్మాణం పూర్తి చేసికొని ప్రతిష్ఠకు సిద్ధమైంది. కృష్ణారావుగారు ఆ శు భకార్యం కూడా స్వామీజీ చేతిమీదగానే జరగాలని పట్టుపట్టటంతో గురుదేవులు తమ అలసటను ప్రక్కకుపెట్టి బయలుదేరారు. వారి శిష్య వాత్సల్యం అలాంటిది. పెదపట్నం పాలకొల్లుకు పాతికమైళ్ల దూరంలో ఉంటుంది. కానీ అక్కడిదాకా ఆగితే రైలు ఆలస్యంగా వస్తుందన్న ఉద్దేశ్యంతో భీమవరంలోనే దింపి, కారులో గెస్ట్‌హౌస్‌కు తీసుకువెళ్లారు గురుదేవులను. స్నానం చేసి, పెదపట్నం బయలుదేరింది వీరి బృందం. ఉదయం గం.10.11ని.లకు ముహూర్తం. సరిగ్గా గురుదేవులు వేదిక మీదికి వెళ్ళేసరికి గం.10.11 నిమిషాలైంది. స్వామీజీ కరకమలాలతో యంత్రస్థాపన, ఊటీ సమర్పణ సరిగ్గా ముహూర్త కాలంలో జరిగాయి. 'అదీ దైవేచ్ఛ అంటే' అనుకొన్నారు అందరూ. ద్వారకామాయి-ధునితోసహా నిర్మించారు ప్రాంగ ణంలో. అది అచ్చం షిరిడీలోలాగా ఉన్నది. గురుస్థానం ఉన్నది. ప్రధా నాలయం రెండు అంతస్థులుగా ఉన్నది. క్రింద సెల్లార్, పైన శ్రీ సాయి నాథుల వారి కొలువు, ముచ్చటైన నిర్మాణం. ఎంతమంది వచ్చినా సత్సంగం చేసుకోవడానికి వీలైనచోటు. పూర్ణాహుతి తరువాత గురుదేవులు తమకు విడిది ఏర్పాటు చేసిన గృహానికి వచ్చి విశ్రాంతి తీసుకున్నారు. (అటుపై వృత్తాంతం వచ్చేనెల ముచ్చటించుకుందాం.)



# విద్యావేత్త శ్రీ జిడ్డు కృష్ణమూర్తి

– కొందరు విద్యావేత్తలు నుండి

(నూతన మత ప్రవక్తగా పేరుపొందిన జిడ్డు కృష్ణమూర్తి తెలుగువాడు. ఆయన మదనపల్లిలో 1895 మే 11న పుట్టాడు. దివ్యజ్ఞాన సమాజ స్థాపకురాలు అనిబిసెంట్ దత్త పుత్రుడిగా పెరిగాడు. ఈయన కోసం అనిబిసెంట్, ఆమె అనుయాయులూ అనేక ఆధ్యాత్మిక సంస్థలు స్థాపించారు. కానీ కృష్ణమూర్తి ఏ మతానికీ, ఏ సంస్థకూ కట్టుబడకుండా ఆ సంస్థల్ని రద్దు చేశారు. వాటి ఆస్తుల్ని వాటికే ఇచ్చేశారు. సత్యాన్ని ఏ మతం ద్వారా, ఏ శాఖ ద్వారా, ఏ మార్గం ద్వారా చేరుకోలేమని అన్నారు. ఆయన తన ఆలోచనలను ఆచరణలో పెట్టేందుకు మదనపల్లి వద్ద ఋషివ్యాలీ స్కూలును, వారణాసి దగ్గర రాజఘాట్ స్కూలును ప్రారంభించారు. విద్యను గూర్చి వారి భావనలు ఇవి)

"మనిషి ఒంటరి ద్వీపంలా మారిపోవడానికి బీజం విద్యా విధానంలోనే ఉందన్నాడు. "మనం పొందిన విద్య, మన సాంఘిక వాతావరణం రెండున్నూ ఎవరి స్వార్థాన్ని వారు చూచుకోవాలని, ఎవరి భద్రత కోసం వారు తంటాలు పడాలని, ఎవరి కోసం వారు పోరాటం జరుపుకోవాలని బోధిస్తాయి. దోపిడీ విధానం మీదా, ఆర్జనకు సంబంధించిన భయం మీదా ఆధారపడిన నేటి యీ సంఘ వ్యవస్థలో అందుకు తగినట్లుగానే వివిధ వృత్తుల్లోనూ, ఉద్యోగాల్లోనూ మనకు శిక్షణ ఇవ్వబడుతుంది. అయితే వీటిని అట్లా చెప్పక సొగసైన మాటలతో కప్పిపుచ్చి మాట్లాడుతాము. అందుచేత అట్టి విద్య మనకు, మనమున్న ప్రపంచానికీ దైన్య సంక్షోభాలను కలిగించడం తథ్యము. ఎందువల్లనంటే అట్టి విద్య వలన ప్రతి వ్యక్తిలోనూ, మానసికంగా అడ్డుగోడలేర్పడి అవి మనిషినీ మనిషినీ వేరుచేసి దూరంగా ఉంచుతాయి.





తెలివి కలిగి ఉండడం అంటే కేవలం అనేక విషయాలు తెలిసి ఉండడం కాదు. తెలివి పుస్తకాల నుంచి సంపాదించుకొనేది కాదు.... చదువుకొన్న వారికంటే చదువురాని వాడెక్కువ తెలివిగలవాడై ఉండవచ్చు. తెలివిని కొలవడానికి మనం పరీక్షలను, డిగ్రీలనూ కొలమానాలుగా ఉపయోగిస్తున్నాము. అతి ముఖ్యమైన మానవ సమస్యలను ఉపాయంగా దాటవేయజూచే చాతుర్యం గల మనస్సులను అభివృద్ధిపరుస్తున్నాము. కానీ తెలివి అంటే అత్యంత ప్రధానమైన మూలభూతతత్వాన్ని, మన కండ్ల ఎదురుగానున్న సత్యాన్ని యథాతథంగా చూడగల సామర్థ్యం. ఈ సామర్థ్యాన్ని తనలోనూ, ఇతరుల్లోనూ మేలుకొల్పడమే విద్య యొక్క పరమ ప్రయోజనము. విద్య యొక్క పరమోద్దేశ్యం కేవలం పండితులను, సాంకేతిక నిపుణులను, ఉద్యోగాల కోసం పాకులాడే వారిని తయారు చేయడం కాదంటాను. విద్య మానవులను సమగ్రతాపూర్ణులుగా తయారుచేయాలి.

నేటి విద్యావిధానం సాంకేతిక నైపుణ్యానికి మితిమీరిన ప్రాధాన్యమిచ్చి మనిషిని నాశనం చేస్తున్నది. జీవితాన్ని అర్థం చేసుకోకుండా, కేవలం సాంకేతిక శక్తిసామర్థ్యాలను పెంపొందించుకుంటూపోతే మనం క్రమంగా కనికరమెరుగని కఠోరస్వభావులుగా మారి, యుద్ధాలకు కారకుల మౌతాము. మన ఉనికికే ముప్పు తెచ్చుకుంటాము.

సాంకేతిక జ్ఞానం ఆవశ్యకమే అయినా అది మనిషిలోని మానసిక ఒత్తిళ్లను, సంఘర్షణలను పరిష్కరించలేదని అంటాడు. అణువిచ్ఛేదనాన్ని తెలుసుకొన్న మనిషికి హృదయంలో ప్రేమభావం లేకపోతే అతడో రాక్షసుడే ఔతాడు. మన శక్తిసామర్థ్యాల వల్ల ఎన్నుకొన్న వృత్తి అవలంబించడం వల్ల మనలోని సంఘర్షణలు, సంక్షోభాలు సమసిపోతున్నాయా? ఇంజనీర్లమో, వైద్యులమో, గణకులమో కాగానే రిజల్ట్ ఓరియంటెడ్ పద్ధతి సరికాదు. ఏదో విధంగా పని అవడమే ప్రధానమైనప్పుడు జీవితం యాంత్రికమై, ఆనందరహితమై, దుర్భరమైపోతుంది" అన్నారు కృష్ణమూర్తి.

“చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లవానికి దోషభూయిష్టమైన విద్యా విధానంలో శిక్షణ ఇప్పించడం ద్వారానేగాకుండా, తాము జీవించే విధానాల ద్వారా కూడా దుఃఖ సంఘర్షణమయమైన మార్గాన పోయేటట్లు ప్రోత్సహిస్తున్నారు. ఆ తరువాత పిల్లవాడు పెరిగి పెద్దవాడై బాధపడుతుంటే వాడి కోసం ప్రార్థనలు చేయడం మొదలుపెడతారు లేదా వాడి ప్రవర్తనకు సాకులు వెదకడం మొదలుపెడతారు” అని తల్లిదండ్రుల మనస్తత్వాన్ని కూడా విశ్లేషించారు జిడ్డు కృష్ణమూర్తి.

## స్వరాంజలి నేస్తమా

- జి. సుశీల

నేస్తమా లేదు, నీకు ఏ వయసుతో పని
లేదు నీకు ఏ సొగసుతో పని
నేస్తమా, లేదు నీకు ఏ తారతమ్యం
లేవు నీకు ఏ యెల్లలు
లేదు నీకు ఏ లింగ భేదం
లేదు నీకు ఏ మతంతో పని
నీకు వినిపించేవి గుండె చప్పళ్లే
నీకు కనిపించేవి ప్రేమ రాగాలే
నేస్తమా, నీవు అందరికీ అందవు
అందితే మాత్రం ఆనందమే.
అంది చేజారితే విషాదమే
నేస్తమా .... నేస్తమా .... నేస్తమా







## మంగళాక్షతలు



అప్పుడెప్పుడో ఏ పాతికేళ్ల క్రితమో పెద్దాపురంలో సాయియజ్ఞాన యజ్ఞంలో తొలిసారి కలిసింది చి॥ కె. నాగ గౌరీకుమారి. గురుదేవుల దర్శనానికై తమ తల్లిగారితో కలసి వచ్చిన ఆ అమ్మాయితో బంధం అలా అలా పెరిగి గాఢమైంది. గోదావరి జిల్లాలలో స్వామీజీ ఎక్కడికి వెళ్లినా ఆమె కాకినాడ నుంచీ వచ్చి దర్శనం చేసుకోవటం- సాయి ధామంలోని ద్వారవతిలో ఉయ్యాలలోకి ‘శయన సాయి’ విగ్రహం పంచలోహాలతో చేయించి తెచ్చి పవళింపజేయటం .... అలాఅలా దగ్గరైపోయింది గౌరి. ఆమె తన ఏకైక కుమార్తె చి॥సౌ॥ అనూషకు, చి॥ మోహనకుమార్‌తో కళ్యాణక్రతువు నిర్వహిస్తున్నారు. మార్చి 9వ తేదీ రాత్రి గం.7.30 ని.లకు కాకినాడ వాసవీ కన్యకా కళ్యాణ మంటపంలో జరిగిన యీ కళ్యాణం శాస్త్రోక్తంగా, రమణీయంగా జరిగింది. ఉన్నత విద్యావంతులైన యీ దంపతులు పరస్పరావగాహన, అనురాగాలతో కలకాలం జీవించి, తమ సత్సంతానాన్ని దేశభక్తులు, లోకోపకారకులు అయిన సత్పురుషుల కోవలోకి తీర్చిదిద్ది, ధన్యులు కావలసిందిగా పరమపూజ్య గురుదేవుల ప్రేమాశీస్సు. ఆ ఆశీస్సుకు సాయిదేవులు తథాస్తని పలికి, మా గౌరికి ఆనందాన్నీ, ప్రశాంతతనూ కలిగించాలని సాయివాణి ప్రార్థన.

శ్రీ ప్రకాశరావుగారి ఇంటిపేరు ఏమిటో మాకు పట్టదు. మాకంద రికీ ఆయన ‘కృషీ ప్రకాశరావు’గారే. వారు వ్యవసాయ కళాశాల (హైదరాబాదు) ప్రాంగణంలోని కృషీ హైస్కూలుకు ప్రధానోపాధ్యాయు లుగా పనిచేసారు. అప్పట్లో సాయీ సేవా సమితికి ఎంతో చక్కని సహాయ, సహకారాలు అందించారు కూడా. శ్రీ ప్రకాశరావుగారు తమ కుమార్తె చి॥సౌ॥ శాంతిశ్రీని చి॥ బండ్లమూడి సుధీర్‌కుమార్‌కు ఇచ్చి, రాజేంద్రనగర్‌లోని సామ దామోదరరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో 09.03.2014

ఉదయం గం.10.50 ని.లకు వివాహక్రతువు సలక్షణంగా నిర్వహించారు. ఈ నూతన దంపతులు తమ విద్యా వివేకాలను కలబోసి ధన్య జీవితాన్ని గడపాలనీ, సత్సంతానవంతులై, వారిని జగత్కళ్యాణకారకులైన ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది దేశమాత ఋణం తీర్చుకోవాలనీ పరమ పూజ్య గురుదేవులు తమ ప్రేమాశీస్సులు అందజేసారు. తథాస్తన్నది సాయివాణి.

కీసర గ్రామవాసులు శ్రీమతి లత, శ్రీ సుదర్శన్ దంపతులు ఆదినుంచీ ఆశ్రమా నికీ ఆప్తులు. ఇక్కడ ఏ ఉత్సవం తలపెట్టినా వారు రాకుండా ఉండరు. గురుదేవుల పట్ల, ఆశ్రమం పట్ల ఎంతో అభిమానం చూపుతారు. వారు తమ పుత్రిక చి॥సౌ॥ హేమప్రియను వాస్తవ్యులు చి॥ అరవింద్‌గౌడ్‌కు 20వ తేదీ ఉదయం 10 గం.45 ని.లకు వివాహం వైభవంగా నిర్వహించారు. ఈ నవ వధూవరులు అతిథి అభ్యాగత సేవలో, వృద్ధ జనసేవలో తరించి, సత్సంతానాన్నికని వారిని చక్కని దేశ పౌరులుగా తీర్చిదిద్ది మాతా పితరుల ఋణం, మాతృభూమి ఋణం కూడా తీర్చుకోవాలని పరమపూజ్య గురుదేవుల దివ్యాశీస్సులు. తథాస్తు!

శ్రీ తుళ్లూరి సోమశేఖరరావుగారు, శ్రీమతి ధనలక్ష్మి రేపల్లె పట్టణ వాస్తవ్యులు. వారి పెద్దల కాలం నుండీ ఆశ్రమానికి పరిచితులు. సాయినాథ క్షేత్రానికి, సాయిధామానికీ కూడా అభిమానులు. వారు తమ ద్వితీయ కుమార్తె చి॥సౌ॥ మానసకు పొన్నూరు వాస్తవ్యులు చి॥ కనమర్లపూడి మణికంఠతో వివాహక్రతువు మార్చి 16 రాత్రి 3.36 ని.లకు శాస్త్రీయంగా మనోహరంగా నిర్వహించారు. ఉన్నత విద్యావంతులైన యీ వధూవరులు చిరకాలం ధర్మానురాగబద్ధులై, సత్సంతానాన్ని కని, వారిని సైతం ధర్మపరులుగా, దేశప్రేమికులుగా తీర్చిదిద్ది పెద్దల ఋణం తీర్చుకో గలరని పరమపూజ్య గురుదేవుల దివ్యాశీస్సు. సాయివాణి 'తథాస్త'న్నది.





# ఏది వస్తుంది?

- 'ద విజన్'లోని ఒక కథ ఆధారంగా

అనగనగా ఓ మనిషి-మృత్యుముఖంలో ఉన్నాడు. అతనికి ఆ విషయం అర్థమయ్యేటప్పటికి ఎదురుగా భగవంతుడున్నాడు-చేతిలో ఓ చిన్నపెట్టెతో. ఆయన-

"ఇక పద బాబూ! వేళయింది ప్రయాణానికి" అన్నాడు.

మనవాడు ఆశ్చర్యంగా, "ఇప్పుడేనా? ఇంత తొందరగానా! నేను వేసుకున్న ప్రణాళికలు ఇంకా చాలా ఉన్నాయే!" అన్నాడు.

"అదేం కుదరదు బాబూ! సమయం మించిపోతోంది నడువు" దేవుఁడు అన్నాడు.

"ఇంతకీ, నీ చేతిలో ఉన్న పెట్టెలో ఏమున్నాయి?" మనిషి అడిగాడు.

"నీకు సంబంధించినవే!" దైవం జవాబు.

"అంటే-నా బట్టలు, వస్తువులు డబ్బూ వగైరాలా?" మనిషి ప్రశ్న

"అబ్బే! అవి నీవికావుగా-భూమికి సంబంధించినవి"-దేవుడు జవాబిచ్చాడు.

"అయితే-నా స్మృతులా?" మనిషి ప్రశ్న.

"ఊహుఁ! అవి నీవి కావు-కదిలే కాలానివి" సమాధానం.

మరి .... నా కార్య కుశలత, తదితర నైపుణ్యాలా?" మరో ప్రశ్న.

"అవి నీవెలా అవుతాయి? పరిస్థితులకు సంబంధించినవి" జవాబు.

"మరి, నా మిత్రులూ, పరివారమూనా?" మనిషి కుతూహలం.

"అవి నీవు ప్రయాణించిన మార్గానికి చెందినవేగానీ నీవి కావు గదా!" దైవం సమాధానం.

"అయితే-నా భార్య, పుత్రులూనా?" మనిషి ఆసక్తి.

"వాళ్లు నీ వాళ్లు కారు. నీ హృదయస్పందించడానికి చెందినవారు"

భగవంతుని వివరణ.

"మరి.... నా శరీరమా?" రవంత విసుగుతో మనిషి అడిగాడు.

"అది ఎప్పుడూ నీది కాదు. మట్టిదేగా!" దైవం జాలిగా అన్నాడు.

అయితే .... అది నా ఆత్మా?" మనిషి కడపటి ప్రశ్న.

"అది నాది గదా!" భగవంతుడు చిరునవ్వుతో అన్నాడు.

"మరేమున్నదయ్యా బాబూ, అందులో!" మనిషి పెట్టె లాక్కొని తెరిచి చూచాడు. అందులో ఏమీ లేదు. ఖాళీ!

మనిషి చెక్కిళ్లపై కన్నీళ్లు ప్రవహిస్తుండగా జాలిగా, బేలగా అడిగాడు- "నాదంటూ ఏమీ లేదా?"

భగవంతుడు మెత్తగా, ప్రేమగా చెప్పాడు - "నీకోసం కాక పరుల కోసం పరమ పవిత్రంగా ఎన్ని క్షణాలు జీవించావో అవన్నీ నీవే!"

# పఠనంతో జన్మ ధన్యం

**- స్వర్గీయ శ్రీ తిరుమలశెట్టి సుబ్బారావు**

దాసగణు రాసిన అర్వాచీన భక్త లీలామృతంలోని 45 అధ్యాయాలలో శ్రీ సాయినాథుని గూర్చిన 31, 32 మరియు 33 అధ్యాయాలను పారాయణగా కొందరు పఠిస్తే, ఒక వ్రతంగా వాటిని కొందరు చదువుతారు. ఆ మూడు అధ్యాయాలను సత్యనారాయణ వ్రత కథలుగా చదవడం ప్రారంభించింది నారాయణగాం అనే ఊరి పటేల్ భీమాజీ. సాయి కరుణ వలన క్షయ వ్యాధి నుండి విముక్తుడయిన అతడు షిరిడీలో నెలరోజులు ఉండి సాయి కీర్తిని గానం చేసాడు. అంతేకాదు సత్యనారాయణ వ్రత కథలుగా అర్వాచీన భక్త లీలామృతంలోని మూడు అధ్యాయాలను చదివేవాడు. ఈ విధంగా సాయి సత్య వ్రతం ఆరంభమై





బహుళ ప్రచారాన్ని పొందింది. సాయి సచ్చరిత్రకారుడైన హేమాడ్‌పంత్ 'వ్రతాలలో ఉత్తమమైనది ఈ వ్రతం' అని రాశాడు.

మోరేశ్వర్ విశ్వనాథ్ ప్రధాన్ మొదటిసారిగా సాయిబాబాను గురించి విన్నాడు. ఆయన తన తల్లితో "సాయిబాబా నిజమైన సాధువో కాదో ఎవరు చెప్పగలరు?" అని సందేహించాడు. షిరిడి నుండి వచ్చిన అతని సోదరుడు సాయిబాబా ఫొటోను, అర్వాచీన భక్త లీలామృతంలోని 31వ అధ్యాయాన్ని ఇచ్చాడు. ప్రధాన్ ఆ అధ్యాయాన్ని తన భార్యకు చదివి వినిపించాడు. దానిని చదవగానే అంతకుముందున్న సందేహాలన్నీ తీరిపోయాయి. ఆయనలో మార్పు వచ్చింది. ఆ క్షణం నుండి సాయిపై విశ్వాసం ఏర్పడింది. సాయి పటాన్ని, ఆ పుస్తకాన్ని తిరిగి తన సోదరునికి ఇచ్చివేయాలనిపించలేదు. ఆయన సోదరుడే వాటికోసం కబురు చేస్తే పంపవలసి వచ్చింది. షిరిడికి వెళ్లి సాయిని దర్శించాలని ఆ కుటుంబసభ్యులు తహతహలాడారు. సాయిని దర్శించారు. వారు సాయికి అంకితభక్తులయ్యారు. ప్రధాన్ సాయి కోసం లెండీ తోటను ఖరీదుచేసి కొన్నాడు. తన రచనను సాయికి అంకితం చేశాడు.

వామన్ ప్రాణ్ గోవింద్ పటేల్ షిరిడిలో సాయిని దర్శించాడు. ఆయన నిత్యపూజలో దాసగణు రచించిన అర్వాచీన భక్త లీలామృతంలోని మూడు, సంత కథామృతంలోనిది ఒకటి పఠించేవాడు. ఆయన మాతృ భాష గుజరాతీ అయినప్పటికీ, ఆ అధ్యాయాలను పారాయణ చేసేవాడు. ఆ వామన్ ప్రాణే సాయి శరణానందుడయ్యాడు.

హరి వినాయక సాఠే అనే సాయిభక్తుడు అర్వాచీన భక్త లీలామృత ముద్రణకు ఆర్థిక సహాయం చేసాడు. శ్రీ సాయి సచ్చరిత్రలోలేని సంఘటనలు, సాయి భక్తుల ప్రస్తావన అర్వాచీన భక్త లీలామృతంలో కానవస్తాయి.